
కేదారేశ్వరి
భోయి భీమన్న

ప్రపంచ తెలుగు మహాసభల

సందర్భంలో

ప్రచురణ

1975

రాక్షస ఉగాది 12.4.1975

ప్రతులకు:

సుఖేలా నికేతన్,

ఐ.సి 85, ఇర్రంమంజిల్ కాలనీ,

హైదరాబాదు - 4

హక్కులు రచయితవి

వెల రూ. 2.50

ముద్రణ:

లలితా ప్రెస్

# అంకితం

తెలుగు జాతి ఒక సంఘటిత శక్తిగా రూపొంది, ప్రపంచ స్థాయికి పెరిగి, తన తొలి వసుధైక మహోదయ జయంతిని జరుపుకొంటున్న ఈ శుభ మహూర్తంలో:

మన మధ్య భౌతికంగా లేకపోయినా, ఉన్నట్టే హార్దికంగా ఏ తెలుగు పెద్దలను గురించి మనం ఫీలవుతామో, అట్టి మహా వ్యక్తులలో కొందరు–

దేశం పారతంత్ర్య శృంఖలాలను తెంచుకోడానికి చావు బ్రతుకుల పోరాటం జరుపుతున్న రోజుల్లో రాజకీయ, సాంఘిక మహోద్యమాలను ముందుండి నడిపించిన అగ్రశ్రేణి విప్లవకారులు–

నన్ను అవ్యాజ అనురాగంతో తమ హృదయాల దాకా రానిచ్చి, ఉన్నత మానవతా వాత్సల్యాన్ని రుచి చూపి, నాకు నా అమాయక జీవితంలో ఎప్పుడు ఏది అవసరమో తామే ఊహించి, అప్పుడు అట్టి సహాయాన్ని అందజేస్తూ, నా సమున్నతికి తోడ్పడుతూ వచ్చిన మిత్రరూప గురుతుల్య పూజ్యపాదులు–

శివైక్యం చెంది, విశ్వచేతనా రూపులై, ఈ మహా సభల నావేశించి ఆనందిస్తూ వున్న బ్రహ్మమూర్తులు–

కళావెంకటరావు
అయ్యదేవర కాళేశ్వరరావు
మాడపాటి హనుమంతరావు
వేముల కూర్మయ్య
తాపీ ధర్మారావు
కల్లూరి సుబ్బారావు

గార్లకు ఈ చిన్ని గేయ గీత పద్య కావ్య సంపుటిని భక్తితో అంకితం చేస్తున్నాను.

బోయి భీమన్న

# లఘు భూమిక

కేదారం అంటే వరి పొలం.

వరి పొలాలను పాలించే పచ్చని తల్లినే కేదారేశ్వరి అన్నాను.

కేదారుడు అంటే అర్థం శివుడు. రైతు కూడ. కేదారనాథుడు, కేదారేశ్వరుడు అంటేనూ శివుడే. రైతు కూడ.

తెలుగు భూమి వరి పొలాల భూమి. అందుకే దీనిని కేదార భూమి అన్నాను. ఈ తెలుగు భూమిని పాలించేవాడు కేదారేశ్వరుడు శివుడైతే, కేదారేశ్వరి శివ. ప్రతి రైతూ శివుడే అయితే, ప్రతి రైతు కాంతా శివే, శివ శక్తే.

ప్రతి జీవికీ ప్రాణాధారం అన్నం, అన్నం తరువాతనే భోగాలు, వ్యసనాలు, పదవులు, అధికారాలు, కళలు, కాంతులు.

ఆర్యుడు అంటే రైతు. అనాదిగా మన ఆర్యభూమి సూర్యభూమే, అన్న భూమి. అందులోనూ మన తెలుగు భూమి సూర్యుడికి మరీ దగ్గరిది. సూర్యుడు సముద్ర గర్భం నుంచి తలెత్తి, కళ్లు తెరిచి, తొలిసారిగా, సూటిగా చూచేది తెలుగు తల్లి ముఖమే. అందుకే తెలుగు తల్లి అన్ని విధాలా అన్నపూర్ణ అయింది.

శివుడంటే ఎక్కడో కైలాసంలో కూర్చునే ఒక దేవుడనుకొని, అలాంటి వాడెవడూ లేడనుకొనే నాస్తికులకు ఈ భావన అవగాహన కాకపోవచ్చు. నేనూ నాస్తికుణ్నే. అయితే నేనే శివుణ్ణనీ, నా కంటె ఇతరుడైన దేవుడెవడూ లేడనీ భావించే నాస్తికుణ్ని నేను. నా భావకోణం నుంచి పరికిస్తే – ఈ కేదారేశ్వరి సర్వసంపత్సంపూర్ణ సుందరేశ్వరిగా ఎవరికైనా సరే సాక్షాత్కరిస్తుంది! సానంద మధుర అవుతుంది.

ఇంతకూ – ఈ దేవి మనలో ప్రతి ఒక్కరమూ, ప్రతి నిత్యమూ దర్శిస్తున్నట్టిదే. తేడా అంతా దృక్పథంలో వుంది. మెదడుతో చూస్తే అదివట్టి వరి పొలం. హృదయంతో చూస్తే సాక్షాత్తు జీవన ధాత్రి, కేదారేశ్వరి!

ప్రతి వరి పొలమూ కేదారేశ్వరే. అయితే – ఈ వరి పొలాలనన్నిటినీ, నిజానికి పంట పొలాలనన్నిటినీ, నీటి వనరుల్నీ, కాయగూరల్నీ, మొత్తం మీద అన్నమయ

ప్రపంచ సమస్తాన్నీ పాలించే ఒక శివంకర శక్తిగా కేదారేశ్వరిని ఊహించాను. రూపకల్పన చేసి, తెలుగు ప్రజల ముందుంచుతున్నాను.

ఈమె తల్లి – ఏ ఒక్కరికో కాదు. తెలుగు ప్రజలందరికీ తల్లి. అందరికీ తల్లి అయిన దానినే దేవత అంటాం. ఇందులో వైపరీత్యం ఏమీ లేదు.

## వీణాపాణి

ఇక్కడొక విషయం చెప్పాలి. ''కేదారేశ్వరి'' శీర్షిక కవితలో మొదటి పద్యం కొంత క్లిష్టంగా వుంటుంది. అది ఆలోచనామృతం. అందులో ఓం, ఐం, హ్రీం, శ్రీం అనే బీజాక్షరాలు వాటంతట అవే ప్రత్యక్షమైనై. శివంకరమైన పద్యబంధం అది.

ఆకాశంలోకి చూడండి. మనకు శ్రావణ భాద్ర పదాలు వర్ష ఋతువు. శ్రవణా నక్షతం సమీపంలో వీణా మండలం వుంది. అక్కడ మనం సరస్వతిని స్పష్టంగా చూడ వచ్చు. ఆమె ఈ పద్యంలో కేదారేశ్వరి. ఆమె యొక్క వీణా వాదన మాధుర్యంచే మబ్బు తునకలనే తుమ్మెదలు ఆకర్షింపబడి, ఆ పాడబడుతున్న గీత పాదాల చుట్టూ చేరి, మధువులు గ్రోలి, పొదుగులు నిండిన కపిల గోవులై, మన తెలుగు భూముల నిండా పాలూ, తేనెలూ వర్షిస్తూ, ఆనందం పండిస్తున్నాయి! అట్టి దేవికి, తెనుగు నేల సిరికి, హేమగర్భకు, కేదారేశ్వరి అయిన మాణిక్య వీణా పాణికి నమస్కారం చేస్తున్న పద్యం ఇది.

ఇందులోని అన్ని పద్యాలను, గేయాలను కూడ ఇలానే అర్థం చేసుకోవలసి వుంది.

ఈ గేయ గీత పద్య కావ్య సంపుటిని ఈ ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంలో తెలుగు ప్రజలకు అందజేస్తున్నాను.

## భావబీజం

1959 ప్రాంతంలో, నవ్య సాహితీ సమితికి నేను అధ్యక్షుడుగాను, పోతుకూచి సాంబశివరావుగారు ప్రధాన కార్యదర్శిగాను వున్న కాలంలో – మా సమితి

ఆధ్వర్యంలో అఖిల భారత తెలుగు రచయితల మహాసభలు జరపాలనుకొన్నప్పుడు, పేరు దగ్గర పేచీ పెట్టారు మా మిత్రులలో కొందరు.

''అఖిలాంధ్ర'', ''విశాలాంధ్ర'' వంటి పేర్లు పెట్టాలికాని, అఖిలభారత ఏమిటి అని వారి వాదం. ''అఖిలభారత'' అంటేనే కాని సభలకు ఆలిండియా హోదా రాదు అని నా వాదం. చివరకు అందులో కొందరు విసిగి (బహుశా - భాస్కరభట్ల కృష్ణారావుగారో, తురగా కృష్ణమోహనరావుగారో - బాగా జ్ఞాపకం లేదు) హేళనగా అన్నారు ''అఖిలభారత ఏమిటి, అఖిల ప్రపంచ అనండి'' అని! ''సమయం వచ్చినప్పుడు అఖిల ప్రపంచ సభలు కూడ చేస్తాం'' అన్నాను నేను. నవ్య సాహితీ సమితిలో చీలిక ఏర్పడడానికి ప్రధాన కారణం అదే కూడ.

ఏమైనా సరే అఖిలభారత అనే అనాలని సాంబశివరావుగారు కూడ పట్టుపట్టడం వల్ల, శ్రీ దేవులపల్లి రామానుజరావుగారి సహకారంతో - అంతవరకు మామూలు మంత్రిగా వున్న మా ఆహ్వాన సంఘాధ్యక్షులు సంజీవయ్యగారు అంతట్లో ముఖ్యమంత్రి కావడంవల్ల ద్విగుణీకృతోత్సాహంతో - అఖిలభారత తెలుగు రచయితల మహాసభలను అత్యంత వైభవోపేతంగా జరపగలిగాం.

నేడు జరుగుతున్న ఈ ప్రపంచ తెలుగు మహాసభలకు - అట్టివి జరపవచ్చునన్న ఊహకు - బీజావాపం ఎప్పుడు ఎలా జరిగిందో జ్ఞాపకం చెయ్యడానికే నేను ఇక్కడ ఈ విషయాన్ని ప్రస్తావిస్తున్నాను.

ఆ తర్వాత ప్రపంచ సభలను జరపాలనీ, అందుకు ప్రభుత్వం పూనుకోవాలనీ తీర్మానాలు చేస్తూనే వచ్చాం. డా. బెజవాడ గోపాలరెడ్డిగారి ప్రోత్సాహంతో సాంబశివరావుగారు. రామానుజరావుగారు, నేను ఈ విషయంలో అప్పటి ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానంద రెడ్డిగారిని రెండు మూడు పర్యాయాలు దర్శించినట్టు కూడ జ్ఞాపకం.

అప్పుడు విద్యామంత్రిగా వున్నప్పుడూ, ఆ తర్వాత ముఖ్యమంత్రి అయినప్పుడూ కూడ శ్రీ పి.వి.నరసింహారావుగారు - రాజకీయ పరిపాలనా రంగాలలో క్లిష్టత అధికం కావడంవల్ల కాబోలు - ఎంత ప్రయత్నం చేసీ ఈ విషయం మీద తమ దృష్టిని కేంద్రీకరించలేక పోయారు.

# కొత్త వెలుగు

రాజకీయాలు, పరిపాలన తొందరలూ గతానుగతికాలే. ఎవరున్నా, ఎవరు లేక పోయినా అవి సాగిపోతూనే వుంటై. ఏ వ్యక్తికీ అందులో గర్వకారణాలేమీ వుండవు. ఏదో ఒక చరిత్రాత్మకమైన పనిచేసినప్పుడే అట్టి వ్యక్తి ప్రతిభా ప్రాభవాలు లోకానికి వెల్లడవుతాయి, ప్రయోజనకరాలవుతాయి. మానవజాతి ప్రగతి పథంలో ఒక కొత్త వెలుగును చూపగల్గిన ఆత్మే మహాత్మ.

అట్టి కొత్త వెలుగును చూపడానికి కేవలం ప్రతిభా ప్రాభవాలూ, శక్తి సామర్థ్యాలూ మాత్రమే చాలవు, హృదయమూ, ప్రజాసేవాసక్తీ వుండాలి. అవకాశాలను కల్పించుకో వాలి. అట్టి అవకాశాలను ఉపయోగించుకోవాలి. అట్టి స్థితప్రజ్ఞులు లోకంలో ఏ కొద్ది మందో!

ఈనాడు ఆంధ్రప్రదేశ ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావుగారు, విద్యామంత్రి శ్రీ మండలి వెంకటకృష్ణారావుగారు ఈ విషయంలో అట్టి స్థితప్రజ్ఞులు. తెలుగు లోక కల్యాణార్థం తిరిగి పుట్టిన కృష్ణార్జునులు. గోపాలరెడ్డి గారన్నట్టు నరనారాయణులు. వీరికి ధర్మరాజు లాంటి దేవులపల్లి రామానుజరావుగారు తోడై అర్థాన్ని శాసించడంవల్ల, ఈ సభలకు త్రైమూర్తక శక్తి సంపూర్ణత సమకూరి, తెలుగు జాతి మహత్తర చరిత్ర త్రిలోక విఖ్యాత శిఖరాల నందుకొన్నది. తెలుగు జగతికే వెలుగైంది.

తెలుగు సంస్కృతీ పునరుజ్జీవన కార్యక్రమాన్ని ఒక మహోద్యమంగా చేపట్టిన యుగ పురుషుడు శ్రీ మండలి. మానవులను ఒక జాతిగా కూడగట్టేదీ, జాతిని బల పరిచి స్థిరపరిచేదీ, జగద్విఖ్యాతిని సమకూర్చేదీ, సకల సుఖ సంపదలతోను అజరా మరం చేసేదీ ఒక్క సంస్కృతే.

భారతదేశం స్వతంత్రమై, త్రిలింగం ఏక ప్రదేశమైన తర్వాత ఇంత కాలాని కైనా – తెలుగు సాంస్కృతిక పునరుజ్జీవన కార్యక్రమం ఒక మహోద్యమంగా చేకొన బడడం, అది పునాదిగా ప్రపంచ తెలుగు మహాసభలు అత్యంత శోభాయమానంగా నిర్వహించబడడం – నిజంగా తెలుగు ప్రజల అదృష్టం. అట్టి అదృష్టంలో పాలుపంచు

కోడానికే ఈ కావ్య సంపుటిని తెలుగు గాయనీ గాయకుల, తెనుగు సాహితీ దర్శకుల, తెలుగు సమ్యక్సహృదయుల చేతులకందిస్తున్నాను.

## ముఖ చిత్రం

ప్రపంచ మహాసభల సందర్భంలో జరిగే ప్రింటింగు పనివల్ల నగరంలోని ప్రెస్సు లన్నీ 24 గంటలూ పనితో ఉక్కిరి బిక్కిరైవున్నాయి. ముఖ చిత్రం గీయించుకొందా మంటే ఆర్టిస్టు మిత్రులందరూ కూడ చిత్ర శిల్ప నిర్మాణాలలో మునిగిపోయి వున్నారు.

విద్యామంత్రి శ్రీమండలివారితో ఏదైనా చెప్పుకుందామంటే – ఇందుగలడందు లేడన్న సందేహం లేకుండా, ఎందెందుకు వెదకనక్కరలేకుండా, అందందు సాక్షా త్కరిస్తూ, వారు నిర్విరామంగా చేస్తున్న పనిని చూస్తుంటే – వారికి ఇంకా ఎందుకు అదనపు శ్రమ ఇవ్వాలనిపించింది, సహృదయులైన వారందరికీ. నాకు కూడ!

ఈ నా కేదారేశ్వరి అనావృష్టి బాధిత అవుతుందేమో అన్నంత భయం వేసింది నాకు కొన్ని బలహీన క్షణాలలో.

అట్టి దిగులుతో, మిత్రులు భూషి రామదాసుగారితో కలిసి కళాభవనం ఆవర ణలో తిరుగుతూ, జయదేవ అష్టపదుల చిత్రప్రదర్శనను చూద్దామని పైకి వెళ్ళాను. లోపలికి ప్రవేశించి, ఒక్కసారి ఆ చిత్రశాలను తిలకించగానే – కళ్ళు చల్లబడి, మనస్సు కుదుటపడి, హృదయం ఆనంద వివశమయింది. నిజమైన కళ ఇవ్వగలిగిన ఆనందం ఎలాంటిదో, మానవాత్మ కళ నుంచి ఆశించే ప్రయోజనం ఏమిటో ఆ క్షణంలో నాకు అనుభూతమయింది.

ప్రదర్శనంలోని చిత్రాలను ఒక్కొక్కదాన్నే చూసుకొంటూ ఎంతోసేపు గడిపా నక్కడ. ఒక చిత్రంవద్ద చాలసేపు నిలబడ్డాను. కొద్ది మార్పుతో అది నా కేదారేశ్వరి కాగలదు! అయితే, అది ఎలా సాధ్యం? చిత్రకారుడితో నాకు పరిచయమే లేదే!

సరస్వతీ మూర్తి అయిన ఎవరైనా, తెలియడమేమిటి? తెలియకపోవడమే మిటి? అసహన లోభులైన మిత్రులు శత్రువులుగాను, గుణగ్రహణ సమర్థులైన శత్రువులు మిత్రులుగాను ప్రవర్తించడం లేదా?

చిత్రకారుడెవరు? అదిగో, ఆయనే టి.ఎస్.కృష్ణ. తుమ్మల సాయికృష్ణ. నన్ను నేను పరిచయం చేసుకొన్నాను. నా కోరిక వెల్లడించాను.

"నేను కూడ ప్రపంచ తెలుగు సభల పనిలో మునిగివున్నాను. అయినా - రేపు ఇటు వస్తారా?" అన్నారాయన. "తప్పకుండా" అన్నాను. నాకు కావలసిన మార్పును సూచించాను. ఆ మరునాడు ఆయన నాకందించిన చిత్రం ఇది - ఈ ముఖచిత్రం! సరస్వతి నా పట్ల ఎంత కరుణామయో! చిత్రశిల్పి శ్రీ టి.ఎస్.కృష్ణగారికి నేను చూపవలసిన కృతజ్ఞత ఎంతో!

-భీమన్న

❋ ❋ ❋

# తెలుగు నేల సిరి

## తెలుగు సరస్వతి

ఎంత దివ్యమైనది
ఈ తెలుగు సరస్వతి !
ఏదో ఒక మధువేనా ?
ఎల్ల రుతువులను తానై
నా ఆరామము నిండా
నవ రుచులతో వికసించు ! ॥ ఎ ॥

ఆకలి కొక దానికేన ?
ఆ కాంక్షల కన్నిటికీ
పూల, పండ్ల గిన్నెలతో
పురుషార్థము లందించు ! ॥ ఎ ॥

ఒక భౌతిక జగతి నేన ?
సకల సౌఖ్య లోకాలను
ఆత్మ దారమున గుచ్చి
అఖిలేశ్వరి కర్పించు ! ॥ ఎ ॥

# ఉగాదికి స్వాగతం

ఓ – మధు మాస నామ్నా
ఓ – అధునా మహిమ్నా

తెలుగౌ ఉగాది, రావమ్మా !
వెలుగుకు ప్రోదే నీవమ్మా ! ॥ ఓ ॥

తెలుగు ఉగాదివె కాదమ్మా !
తెలివి యుగాదే నీ వమ్మా !

అధునాతన ఆంధ్రప్రదేశ ఈ
శా ! నిత్య శుభాశా ! రావమ్మా ! ॥ ఓ ॥

అనువుకు అరుణోదయ వమ్మా !
అవనికి నవజీవన వమ్మా !
శుక పిక మధు పానంద గీతముల
సుమన స్స్వాగత మిదె కొమ్మా ! ॥ ఓ.॥

## ఎన్నాళ్ళకు ! ఎన్నాళ్ళకు !

ఎన్నాళ్ళకు ! ఎన్నాళ్ళకు !
ఇన్నాళ్ళకు ! ఇన్నాళ్ళకు !

కాలం వక్రించి, ఖండ
ఖండాలై పోగా–
ప్రతీ తెలుగు వాడూ ధ
న్వంతరిగా రూపొందుట ! ॥ ఎ ॥

చివరికి ఒకటై లేచిన
శ్రీమ దాంధ్ర భూ లక్ష్మి
చెదరి వున్న బిడ్డల నొక
చెరగు నీడ లాలించుట ! ॥ ఎ ॥

ప్రపంచంలో దశ దిశలా
పరిమళి స్తున్న మణులు
రాశులుగా వచ్చి, తెలుగు
రాజ్యేశ్వరి నర్చించుట ! ॥ ఎ ॥

# దేశ మాత

దేశ మాత భూ మాత,
తెలుగు తల్లి గో మాత
అసలు మాత కంటె ముందు
ఆరాధ్యులురా ! ॥ దే ॥

భూ మాతను సేవించగ
గో మాతను పోషించగ
ప్రజలందరి సంక్షేమమె
ప్రథమ ధర్మమౌ కదరా ! ॥ దే ॥

ప్రజలనగా ఎవరురా ?
పైసలున్న పది మందా ?
హలముల, కలముల నడుమ
అన్నార్థులె ప్రజలు రా ! ॥ దే ॥

దేశ మాత భూ మాత
తెలుగుతల్లి గోమాత
ఈ మాతల సంతృప్తే
నీ మనుగడ సఫలతరా ! ॥దే ॥

# నాగార్జున సాగరమా

నాగార్జున సాగరమా !
నవ దేవాలయమా !
నవ దేవాలయమా ! మా
నవ జీవాలయమా ! || నా ||

మానవ విజ్ఞానానికి
మకుటాగ్రపు మణి దీపము !
శ్రమ శక్తికి, జన శక్తికి
జయ సంకేత పతాకము ! || నా ||

సాగరాల హృదయాలకు
సస్యేందిర సందేశము !
క్షేత్ర దేవి అడుగడుగున
శ్రీ రంజిలు మంజీరము ! || నా ||

తెలుగు నేల పండింప
వెలుగు నేల కందింప
పర తెంచిన కృష్ణ రమా !
పరమాన్నపు పళ్లెరమా ! || నా ||

## మామిడి తోరణాలు

మల్లెల దండలు
మామిడి తోరణాలు !
బంగరు పంటలే
పంటల పండగ లే ! ॥ మ ॥

ఏ ఇంట ఆగినా
ఏ వీధి కేగినా
కపురపు దీపాలే !
కమ్మని ధూపాలే ! ॥ మ ॥

ఏ మోము చూచినా
ఏ కంట కాంచినా
చల్లని వెన్నెలలే !
సరసా నందము లే ! ॥ మ ॥

పండగ ఏ దైనా
గుండెకు ప్రతిబింబమె !
గుండె ఎవరిదైనా
పండగ కోసమే ! || మ ||

దసరా వేడుకలా ?
సరదా సంక్రాంతుల ?
సమాయిత ప్రపంచాంధ్రుల
సమీకృత కళాకాంతులు ! || మ ||

# బ్రతుకే ఉద్యమం

వీరుడ వగుదువా ?
శూరుడ వగుదువా ?
దేశ దేశముల వెలిగే
ధీరుడ వగుదువా ? || వీ ||

సంఘర్షణ సహజం, బ్రతు
కంటేనే సమరం,
వెర పెరుగక నిల్చి గెల్చి
విక్రమించి మించనిచో || వీ ||

మృత్యువునకు భయపడుట
సత్యమునకు భయపడుటే,
శాంతి సత్యములకై నీ
సత్త్వము చూపించనిచో || వీ ||

ఊహల, చేతల నీ వొక
ఉద్యమమై బ్రతకనిచో
మహిమలు కల మహికే నీ
మహనీయత పంచనిచో || వీ ||

# సైనికులం

సైనికులం – మనం
శ్రామికులం ! ॥ సై ॥

జాతి ప్రాణ రక్షణకై
సమర భూమి లందు,
బంటుతనం పోషించే
పంట భూమి లందు ॥ సై ॥

రాజ్య రమా ప్రభుతకై
రక్త తర్పణం చేసే
యువ వీరుల పుష్టికై
ఒడలు వంచి చెమ టోడ్చే ॥ సై ॥

దానవతను తెగటార్చి
మానవతను రక్షించే,
ముళ్ళ పాదలు తెగనరికి
ముత్యాలను పండించే ॥ సై ॥

# మనిషి మారాలి

మారాలి–
మనిషి మారాలి !
మనిషికి మనిషికి నడుమ
మంథరాలు తిరగాలి
ద్వేషాగ్నులు చల్లారి
ప్రేమ సుధలు ఊరాలి ! ॥ మా ॥

తోడివాని శ్రమ ఫలమును
దోచుకొనుట తొలగాలి,
పనీ, తీరికా, వేడుక
ప్రతి మనిషికి కలగాలి ! ॥ మా ॥

పొట్ట కూటికై మనిషి
పోరాటం ఆపాలి,
ప్రజలందరి ఆనందమె
ప్రగతికి విధి కావాలి! ॥ మా ॥

పేద వాని కుండలలో
వేద మధువు నిండాలి,
వేద మాత గుండెలలో
విశ్వ జనత పండాలి ! ॥ మా ॥

## తెలుగు ఆత్మ

వీణ కంటె విన సొంపు
మా తెలుగు వాణి,
వాణి కంటె వరలక్ష్మి
మా తెలుగు బాణి ! ॥ వీ ॥

బృంద మించి రమణీయ
మా తెలుగు తోట,
నందనమే ప్రతి పెరడూ
మా తెలుగు వీట ! ॥ వీ ॥

రత్న గర్భ, అన్న పూర్ణ
మా తెలుగు నేల,
రాజసగుణ, రవి కిరణ
మా తెలుగు బాల ! ॥ వీ ॥

## గోపాలనం

గోవుల గాసేవో ?
గోళీ లాడేవో ?
గోదావరి వరి పొలములలో
గోవుల గిట్టల గుంటలలో ! ॥ గో ॥

పాటలు పాడేవో ?
ఆటలు ఆడేవో ?
పాటలలో, ఆటలలో మునిగి
పని పాటులు మరిచేవో ? ॥ గో ॥

అమృతం పితికేవో ?
ఆత్మను వెతికేవో ?
గోళీ ఆటల గుంజాటనలో
గోవులనే వదిలేసేవో ? ॥ గో ॥

# ఇళ్ళకు గోవులు

తరలె నొహో !
తమ తమ ఇండ్లకు గోవులు
తరలె నొహో ! ॥ త ॥

కడుపుల నిండా పచ్చిక మేసీ
కన్నుల నిండా కాంతులు క్రోలీ
తరలె నొహో ! ॥ త ॥

పశు పతియే గోపాలుడు కాగా
పరమానందమె చేపులు రాగా
తరలె నొహో ! ॥ త ॥

తెలుగు నేలయే గో లోకముగా
దివ్య తారలే దిగి వచ్చిన వన
తరలె నొహో ! ॥ త ॥

## బాలయోగి

ఆకాశ గంగతో అభ్యంగ మొనరించి,
పమిట చెరగులతోడ తమిమీర తడులొత్తి,
ఉడులోకముల వెలుగు పొడు లలది, ప్రతి ప్రొద్దు
లక్ష్మీ సరస్వతులు లాలింత్రు నిన్ను

బాల యోగీ ! యోగ బాలోప భోగి !
అందుకోవయ్య, మా ఆత్మోత్పలములు.

సురవన సుమాల అత్తరులతో తల దువ్వి,
నెలవంక ముడిచి, పాముల కండువా చుట్టి,
తండ్రి వాలక మెట్లు తప్పునని శివు నెంచి,
ముదముతో జగదంబ ముద్దాడు నిన్ను !

బాలయోగీ ! యోగ బాలోప భోగి !
అందుకోవయ్య, మా ఆత్మోత్పలములు!

తన పసితనము నాటి తానె కాబోలు నను
కొని, కాళి చూడవచ్చిన గుట్టు చెడు నంచు,
పాములను పుట్టలకు పారదరిమే శివుడు
తెలివొంది, నవ్వుకొని, దీవించు నిన్ను !

బాల యోగీ ! యోగ బాలోప భోగి !
అందుకోవయ్యా, మా ఆత్మోత్పలములు !

బాల సూర్యుని దీప్తి, బాల చంద్రుని కాంతి,
బాలకృష్ణుని గీతి, పరమమున యోగించి,
బాల యోగిగ నీవు ప్రభవించినావు !
ఆత్మ పారమ్యమును ఆర్జించినావు !

బాల యోగీ ! యోగ బాలోప భోగి !
అందుకోవయ్యా, మా ఆత్మోత్పలములు !

యో గాసనమున నీ వుండు నదియే గుండె,
ధ్యాన మందున నిన్ను ధరియించునదె బుద్ధి,
ఆనందమున నీతో ఐక్యమౌనదె ఆత్మ,
నీ పూజె శివపూజ ! నీ దర్శనమె శివుడు !

బాల యోగీ ! యోగ బాలోప భోగి !
అందుకోవయ్యా, మా ఆత్మోత్పలములు.

## కూలీ - రైతూ !

దిన కరుడే కార్మికుడు,
ధాన్య కరుడు కర్షకుడు !
కార్మికుడే సూర్యుడు,
కర్షకుడే చంద్రుడు
ఆత్మ శక్తి నేత !
అన్నామృత దాత ! ॥ ది ॥

పై వాడితో క్రింది వాడి
బాంధవ్యమె జీవనం,
శ్రమికుల, కర్షకుల ఆత్మ
సంయోగమె జీవితం !
పొలమె ఆది శక్తి,
హలమే శివ శక్తి ! ॥ ది ॥

చెమటోడ్చే వాడె రవి,
చిద్వి లాసియే శశి!
రస బ్రహ్మ దిన కూలీ,
రాగాత్మే సినీవాలి !
కార్మిక కర్షకులదే
ధార్మిక జీవన మహి ! ॥ ది ॥

# నమస్కారం

నమస్కారం-
నమస్కారం !
తెలుగు బీజం మొలక లెత్తిన
దివ్య గోదావరి పొలాలకు !
తెలుగు జీవం తేజరిల్లిన
నవ్య కృష్ణాఝరి హలాలకు ! ॥ న ॥

తెలుగు వాణికి రూప మిచ్చిన
తెలుగు బాణికి దీప మొసగిన
నన్నయకు, తిక్కన్నకును, పో
తన్న, వేమన, త్యాగరాజుకు ! ॥ న ॥

తెలుగు వీరం దెసలు నిండిన
తెలుగు ధీరం పసలు పండిన
రాణి రుద్రమ దేవికి !
రాజ సామర జీవికి ! ॥ న ॥

# అభ్యుదయేశ్వరి

అభ్యుదయేశ్వరీ !
అవనికి దిగు మరీ ! ॥ అ ॥

చీకటి నుంచి
వెలుగును సృష్టించి,
రాత్రిని కరిగించి
పగటిని నిర్మించే ॥ అ ॥

పగటినె మూసి
వెలుగును మేసి
నల్ల వారిన మనిషి
తెల్లవారే కొరకు ॥ అ ॥

మొగ్గ - పెగలనీ
పువ్వు - పేలనీ
తావి - నిండగా,
పిందె - పండగా ॥ అ ॥

రక్తం జ్వలించ నీ
రాగం ఫలించ నీ
రాతిరి కడుపున
రవి ఉదయించగా ॥ అ ॥

# వరిలక్ష్మి పుట్టిల్లు

రమ్ము, దేవి ! మా తెలుగు పొలమ్ము లందు
లక్ష్మివై, తెల్గు పాఠశాలలను వాణి
వై, తెలుగు గేహములను భవాని వగుచు
రమ్ము ! సిరు లెల్ల నీవుగా రమ్ము, దేవి !

కృష్ణ, మంజీర, గోదావరియును, పెన్న,
వంశధార, మూసీ, తుంగభద్ర – ప్రముఖ
వాహినీ సరస్వతులు నీ స్నేహమునను
పూర్ణ జీవన సౌభాగ్యముల రహింత్రు !

తొలకరికి కేలు మోడ్చి, ఊడ్పులు ముగించి,
గడ్డిగంపలతో బోదెగట్లు చేరి,
ఏలలన్ నిను గొల్చు మా మాల పిల్ల
లమృత రూపిణి ! నీకు అద్దములె సుమ్ము !

ఏడు కొండల శిఖరాల కెదిగి, దివికి
ఓ సరిల్లి, పిల్లన గ్రోవి నూదు కొనెడు
తెలుగు వెంకన్న నీ కాతిథేయు మొసగ
చూచెదవు గాని – అచ్చ యశోద సుతుడె !

శేషగిరి నుండి సింహాద్రి శిఖరమునకు
కల్ప మంజరు లూయెల గట్టి, తెలుగు
కడలి తరగల చెలులు రంగార నిన్ను
మించుల యెడంద లడర నూగించ గలరు !

బోదెలన్ తూటి, చేమయు, పొన్నగంటి;
గట్లపై బెండ, బీర; లంకలను వంగ
గోగు, గుమ్మడి – ఎవో కాయ గూర లెల్ల
చేయి చాచిన నందు మా సీమ నెందు !

సెనగ, ఉలవ, పెసర, కంది, అనుము, మినుము
పనస, మామిడి, నారింజ, కొబ్బరి, అనాస-
ఈత, తాడి, విప్ప, చెరకు – ఇన్ని అన్ని
అనగ నేల, తెలుగు దేశి అమృత రాశి !

జొన్న, వరి, చోడి; పాలును, జున్ను, పెరుగు;
పాయసమ్ములు, వడలు, ఊర్గాయ దినుసు;
నిత్య సాహిత్య సంగీత నృత్య కళలు;
కలిమి చెలువకు పుట్టిల్లు తెలుగు ఇల్లు !

అన్నమున కింత లోటు లేకున్న గాని
ఏమి టీ లేమి అంచు చింతించ వలదు;

స్వార్థమున, మౌఢ్యమున నరు డార్తినొందు !
ఆతని స్వభావ మది, మన చేత లేదు !

కొందరికి గుండె చిన్నది, కొందరికి మ
నస్సు చిన్నది, బ్రతుకె కొందరికి చిన్న;
దంత మాత్రాన ఇల చిన్నదనము లేదు,
పెత్తనము చేయు నీ కన్ను పెద్ద దైన !

అరటి యాకుల విస్తళ్ల అన్నపూర్ణ
పరచి నట్లుండు మా తెల్గు వరి పొలాలు !
వచ్చి వడ్డింపు మెల్ల జీవన రుచులను
శార దైందవి ! సరి పంక్తి జనత కెల్ల !

**1**

శ్రీ మాణిక్య విపంచికా నవ రవ
హ్రీ ముగ్ధ గీతాంభ్రములన్
జీమూ తాళుల నిల్పి – సోంభిత గవా
నీ కమ్ములై అవ్వి మా
భూమిన్ పాలును, తేనెలున్ కురియ – స
మ్మోదమ్ము పండించు తత్
హైమాభ్యంతరి ! తెన్గు నేల సిరి ! కే
దా రేశ్వరీ ! తే నమః !

## 2

ఇది వైకుంఠము – వెంకటేశ్వరుడు ల
క్ష్మీశుండు కొల్వుండు టన్;
ఇది కైలాసము – మల్లి కార్జునుడు ఆ
ర్యేశుండు చెల్వొందుటన్;
ఇది బ్రహ్మోర్వి – సరస్వతీ చరణ పం
కే జాతమ్మై యుండుటన్;
ఇది మా ఆంధ్రము, నీకు పీఠము, త్రి శ
క్తీ ! పూజ గైకో గదే !

## 3

ప్రాణాధార పదార్థ మన్నమె, పర
బ్రహ్మమ్ము సాక్షాత్తు; అ
న్నానన్ పుట్టును, పెంపు నొందును ప్రపం
చ మ్మెల్ల; అద్దాని కె
ద్దానన్ రూప గుణమ్ము లెక్కు,, నదె కే
దారమ్ము; కేదార ల
క్ష్మీ నారాయణి ! తెల్గు చిత్తముకు సం
కేతమ్ము నీవే కదా !

## 4

తెలు గన్నన్ వెలు గౌను; లోక జన శ
క్తిన్ పెంచి, పోషించి, కాం
తులు పండించు శివంకరుండు ప్రతి రై
తున్ ఇందు కేదారుడే;
సెల యేళ్ళా ? అవి లేళ్ళు, ఇందు ధవళా
శీర్వాదముల్, నీవె ! మా
కల మాన్నమ్ములలో ప్రతీ మెతుకు నీ
కల్యాణ సౌభాగ్యమే !

## 5

గంగకు వంక లుండినవి;
గౌతమి కున్నను, రమ్యవాః కళా
భంగిమ లవ్వి; కృష్ణయు ను
భంజిత కృష్ణయె ప్రాణి సేవలో;
నింగిని నేలనున్ గలుపు
నెయ్యపు వియ్యపు పేరటాంద్రు త
క్క్యం గల వాహినుల్; తెలు గొ
కో? ఇది స్వర్గపు వెల్గు కాదొకో !

## 6

ఇతి హాసమ్ము సృజించు వీరుని కరా
సే కాదు, అందాల రా
ణి తలంటున్ విరియించు మానవుని గుం
డెన్ నిండు రోజా పువుల్ !
సత తాభ్యున్నత సర్వ సంస్కృతికి బీ
జం బీవ ! నీ చేతిలో
ప్రతి పూవున్ ఒక బంతి పూవై అయి సం
వాసించు మా తోటలన్ !

## 7

మా పొలముల్ శరద్గగన
మండలముల్; ఫల పుష్ప సస్య రా
శీ పథముల్; సుపర్వ మధు
శీధు పయః పరిపూర్ణ జీవికల్;
రూపము గొన్న పాల్కడలి
రో ! వెలు గొందుము, సర్వ సంపదల్
దీపములై భవచ్చరణ
దేశము లెల్ల మదీయ దేశిగా !

## 8

చెరుకున్, కొబ్బరి, జొన్న, మామిడులు వం
శీ రాగపుం బైరలన్
వరి లక్ష్మిన్ అలరింప; మబ్బులు మృదం
గ శ్రీలు వర్షింప; శం
కరు డాడన్; నిఖిలాంధ్ర దేశము త్వదా
నంద ప్రియ క్షేత్రమే !
సరదా మంతులు మా తెలుంగులు; రస
స్వామ్యమ్ము పాలింపుమా !

## 9

ఆకుం బచ్చన, ఇంద్ర నీల రుచి, సూ
ర్య స్వర్ణ తేజమ్ము, జ్యో
త్స్నా కల్హార పరాగ శోభ – తములో
నన్ తాము స్పర్థించుచున్
నీ కాల్దారుల గొల్చి వచ్చు ప్రగతిన్
నిత్యమ్ము; మా తెల్గు భూ
మీ కామేశ్వరి ! నీ ప్రభుత్వ కృషు లీ
మృష్టాన్న శిష్టోన్నతుల్ !

## 10

కలతలు లేక, తా మొకరి
కష్ట ఫలమ్ములు దోచ, కందరున్
కలిమిని కాంతినిన్ సమము
గా గొను, చెల్ల ప్రపంచ మాన వా
ళులకును లక్ష్య జాతిగ తె
లుంగు ప్రజల్ వెలుగొందు నట్లు అం
కెల గొని, ముద్దుచేసి, కరు
ణింపుము, దేవి ! సదా రస స్థితిన్ !

## 11

వాణియె తీరవాటిక, భ
వానియె రాయల సీమ, శ్రీ తెలం
గాణము; పూర్ణ రాజ్య రమ
గా ముగురమ్మల మూర్తి దాల్చి, గీ
ర్వాణ పథమ్ములన్ కదలి
వచ్చితి, వేలు కొనంగదే ఇకన్ !
ప్రాణము లొచు మా తెలుగు
ప్రాలు జగత్ స్థితి కార్తలై తగన్ !

## 12

ఈ వన వీధు లందు నటి
యించు సదా మధు దేవిగా కళా
దేవి త్వదర్థమై; ప్రగతి
తెర్వులలో వికసించు విప్లవా
రావము కచ్ఛపిన్; తెలుగు
రాజస మందు భజించు నిన్ను ఉ
జ్జీవిత సంస్కృతీ మహిత
శిల్ప మహోదయ సర్వ శ్రేయముల్ !

## 13

పాగా చుట్టి, జలత్రమున్ గొని, వయో
భద్రుండు మా ఆంధ్రు డు
ద్యోగ ప్రౌఢిమ గట్టుపై నిలువగా-
ద్యో వీధి కే ల్మోడ్చి, కృ
ష్ణా గోదావరులన్ మలంచి, నజరా
నా పెట్టదే ! క్షేత్ర గం
గా గార్హస్థ్యము మా కృషీశ్వరుని లో
కారాధ్యు గావింపదే !

## 14

పరమ కవిత్వ మందు ప్రతి
బాలుడు పచ్చని పోతరాజె, సుం
దర వరగాన మందు ప్రతి
తమ్ముడు నిచ్చలు త్యాగరాజె, స
త్వర ఫల దానమందు ప్రతి
వాడును అచ్చపు భోజ రాజె, నే
డరయ నవాంధ్ర మందు ప్రజ
లందరు రాజులె ! రాజ మౌళులే !

## 15

దేశము చుట్ట బెట్టి, తల
దిండుగ పెట్టుక నిద్ర పోవు ఆ
వేశము తెల్గు వానిది; ప్ర
వేశము తక్కువ కార్య నైపుణిన్;
ఏ శిఖరాల పైకి పయ
నించునొ ! ఏ శశికై గమించునో !
ఆశల కల్పముల్ కొని, శ్రి
యశ్శివసుందరి ! దారి చూపవే !

## 16

శ్యామల సస్య పుష్పలము,
స్వాదు ఫలోప వనాలయమ్ము, ల
క్ష్మీ మహనీయ నాట్య సర
సీజము, మా విపులాంధ్ర; మీ సుధా
ప్రేమ రసమ్ము క్రోలి మధు
రిల్లుమ్ము, అన్నరసేశ్వరీ! తదా
శా ముకుట ప్రభా లస దు
ష స్సుమన స్సుమనోజ్ఞ శయ్యలన్ !

## 17

రస పూర్ణమ్ము, వసంత ధామము, కళా
రామమ్ము, కల్యాణ కా
వ్య సుమారాధ్యము, భావనా కుహు కుహూ
వాదమ్ము, వాగ్గేయ సా
ర సమారంజిత శింజినీ ఝణ ఝణా
రమ్యమ్ము మా ఆంధ్ర; మీ
వసుధా వేదిక నీది, దిద్దుకొను మం
బా ! మమ్ము నీ ఇచ్ఛమై !

❋ ❋ ❋